భర్త వేరొకరితో సన్నిహితంగా ఉన్నాడని భార్య ఆత్మహత్యాయత్నం

- ఈ నెల 8న ఏడో అంతస్తు నుంచి దూకిన వివాహిత
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 10న మృతి
- చనిపోయాక తండ్రికి సమాచారం!

కొత్తపేట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో భర్తతో మనస్పర్థలు తలెత్తడంతో ఈనెల 8న వారు ఉంటున్న అపార్టుమెంట్ 7వ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో వివాహిత మంగళవారం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కమలేశ్వర్ కొంత కాలంగా ఎల్బీనగర్ ప్రజయ్‌టవర్స్ 7వ అంతస్తులో తోటికూలీలతో కలిసి ఉంటున్నాడు. 5 నెలల క్రితం అతడు అదే ప్రాంతానికి చెందిన సాధన(22)ను పెళ్లి చేసుకుని తీసుకొచ్చాడు. ఇద్దరూ కూలీ పనులు చేసుకుని జీవనం కొనసాగించారు. తన భర్త ఇంకో యువతితో చనువుగా ఉంటున్నాడని సాధన తరచూ అతడితో గొడవపడేది. ఇలా ఇద్దరి మధ్యా మనస్పర్థలు తలెత్తడంతో ఈనెల 8న మధ్యాహ్నం 7వ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ప్రజయ్ టవర్స్ సెక్యూరిటీ ఇన్‌చార్జి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కానీ ఆరోజు కేసు నమోదు చేయలేదని, కనీసం బాధితురాలి తండ్రికి కూడా విషయం చెప్పలేదని సమాచారం. బాధితురాలు మృతి విషయాన్ని ఆమె తండ్రి జానకిరామ్ కోస్లేకు మంగళవారం తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు మృతురాలి భర్త కమలేశ్వర్‌ను అరెస్టు చేశారు.

ఐలమ్మకు నివాళి

ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, చంపాపేట, టెలిఫోన్‌కాలనీ,నాగోల్, ఎల్బీనగర్ రింగ్‌రోడ్ చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటాలకు, విగ్రహాలకు సీపీఐ, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఎల్బీనగర్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు బాతరాజు నరసింహ, సుధాకర్ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధి ఆర్ఎన్ఆర్ కాలనీలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్‌నాయక్, దాసరి ప్రసాద్, శేఖర్, నర్సింహ, రాములు, నర్సింహ, రవి, పుల్లయ్య, యాదగిరి, నిరంజన్ పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో...

హయత్‌నగర్: హయత్‌నగర్ మండలం సీపీఐ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సామిడి శేఖర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి వంశీవర్ధన్‌రెడ్డి, మండల సహాయకార్యదర్శులు నక్రునాయక్, శ్రీదేవి, నాయకులు వెంకట్, అనిత, సౌజన్య, మర్రి శోభన్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

చంపాపేటలో....

చంపాపేట: చంపాపేటలో చాకలి ఐలమ్మ విగ్రహానికి టీపీసీసీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి మెట్టు వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నోముల రవీందర్‌గౌడ్, మాతంగి యాదగిరి, అంజనేయులు, సిద్ధారెడ్డి, భస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

టెలిఫోన్‌కాలనీలో...

ఎల్బీనగర్ : ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని టెలిఫోన్‌కాలనీ బీజేఆర్ భవన్ వద్ద గల చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్‌కేపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్, బండి మధుసూదన్, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తలాటి రమేష్‌నేత, వంగూరి యాధవరెడ్డి, ఎల్లన్న, కళ్యాణ్, లింగస్వామిగౌడ్, తిలక్, శ్రీశైలం, శ్రవణ్, సాయి, జగదీష్, నగేష్, కిట్టు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

- నాగోల్ చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కృష్ణ, చుక్కయ్య, మహేందర్, అనంతుల రాజారెడ్డి, సురేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ రింగ్‌రోడ్ చౌరస్తాలో

- సీపీఐ సరూర్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ రింగ్‌రోడ్‌చౌరస్తా సమీపంలో ఐలమ్మ చిత్రపటానికి రంగారెడ్డి జిల్లా సీపీఐ కార్యవర్గసభ్యులు బాతరాజు నరసింహ నివాళులర్పించారు. సీపీఐ సరూర్‌నగర్ మండల సహాయ కార్యదర్శి కందుల సుధాకర్, బోయపల్లి రాములు, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎండీ ఫైమిదా, కమలమ్మ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మద్దిలేటి, శాఖ కార్యదర్శులు శ్రీనివాస్, లింగస్వామి, లక్ష్మి, శోభ, పార్వతమ్మ, యాదగిరిరెడ్డి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



కర్మన్‌ఘాట్ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ప్రయోగశాలను పరిశీలిస్తున్న నోడల్ అధికారులు

నైపుణ్యాలను పెంచడానికే ప్రయోగశాలలు

చంపాపేట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ అవసరాలను తీర్చడానికి, నైపుణ్యాలను పెంచడానికి అటల్ టింకరింగ్ ప్రయోగశాలలు దోహదపడుతాయని తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి బృంద పిల్లై అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అటల్ టింకరింగ్ ప్రయోగశాలల నిర్వహణ, అభివృద్ధిపై నిర్వహించిన కార్యక్రమానికి 33 జిల్లాల అటల్ టింకరింగ్ ప్రయోగశాలల నోడల్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బృంద పిల్లై మాట్లాడుతూ ప్రయోగశాలలు ప్రింటర్స్, సెన్సార్స్ వలయాలు రోబోటిక్స్ డ్రోన్‌లతో కూడిన అధునాతన సాంకేతికను ఈ ప్రయోగాలతో వినియోగిఇంచుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి వెంకటస్వామిగౌడ్, హెచ్ఎం పద్మ, రంగారెడ్డి జిల్లా సైన్స్ అధికారి వై.శ్రీనివాసరావు, ప్రయోగశాల నిర్వహకులు వెంకటేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం కోసం చెట్ల కొమ్మలను తొలగించండి

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): గణనాథుడి విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలూ కలుగకుండా చెట్లకొమ్మలను తొలగించాలని అధికారులకు మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి సూచించారు. మంగళవారం మూసారాంబాగ్, శాలివాహననగర్ కాలనీ, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీల్లో జీహెచ్ఎంసీ హార్టికల్చర్ విభాగం చేపడుతున్న చెట్లకొమ్మల తొలగింపు పనులను ఆమె పరిశీలించారు. ఈనెల 17న జరగనున్న మహా నిమజ్జనం నాటికి మూసారాంబాగ్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించాలని ఆమె సూచించారు. జీహెచ్ఎంసీ యూబీడీ మేనేజర్ కృష్ణ, విద్యుత్ లైన్‌మెన్ లలిత్ తదితరులు పాల్గొన్నారు.



పీఆర్‌టీయూ చార్మినార్ మండల కమిటీ అధ్యక్షురాలిని అభినందిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి టి.తిరుపతిరెడ్డి తదితరులు

టీఎస్ పీఆర్‌టీయూ చార్మినార్ మండల కమిటీ అధ్యక్షురాలిగా ఇస్రాత్ సుల్తానా

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): టీఎస్ పీఆర్‌టీయూ చార్మినార్ మండల కమిటీ అధ్యక్షురాలిగా ఇస్రాత్ సుల్తానాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రానా సలీం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మందడి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి టి.తిరుపతిరెడ్డి సమక్షంలో ఈ మేరకు కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా కార్యదర్శి వి.అశోక్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేశ్వర్, రాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొని మండల కమిటీని అభినందించారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

గుర్రంగూడలో అభివృద్ధి పనులు ప్రారంభం

సరూర్‌నగర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ గుర్రంగూడ 6వ డివిజన్‌లోని వినాయకనగర్‌కాలనీ, 7వ డివిజన్‌లోని ఫ్రైమ్ పార్క్యూన్, ఆదిత్యానగర్ కాలనీల్లో కొత్తగా చేపట్టనున్న సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను కౌన్సిల్ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్‌లో భూగర్భ డ్రైనేజీ, రోడ్ల నిర్మాణంతో పాటు తాగునీటి వసతి కల్పనపై ప్రత్యేకదృష్టి పెట్టినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ బిక్కూనాయక్, కాంగ్రెస్ నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి, జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎదుల్ల ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నోట్‌బుక్‌లను అందిస్తున్న చిల్డ్రన్ ఆఫ్ డెక్కన్ ఫౌండేషన్ ప్రతినిధులు

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): చిల్డ్రన్ ఆఫ్ డెక్కన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పసుమాముల జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. అదేవిధంగా విద్యార్థినులకు రక్షణ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలికల సంరక్షణ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పూజ, దియా, మల్లన్న, స్లాప్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, వినీత్, రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల కొరత ఉన్నదని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అదనపు తరగతి గదులను నిర్మించాలని కోరారు. పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలకు మరమ్మతులు చేయించాలని కమిషనర్ అమరేందర్‌రెడ్డిని ఆదేశించారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం కృషిచేస్తోందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ ఆలయం పక్కన ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్‌రెడ్డి, కౌన్సిలర్‌నక్క శివలింగంగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తొర్రూర్ పాఠశాలను సందర్శిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

25న మత్స్యకారుల రాష్ట్ర సదస్సు

హయత్‌నగర్: చెరువులు, కుంటలను కబ్జాల నుంచి, కాలుష్యం నుంచి కాపాడాలని ఈనెల 25వ తేదీన ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన మత్స్యకారుల రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు అండగా ప్రభుత్వం ఉంటుందన్నారు. మత్స్యకారులకు రాష్ట్ర వ్యాప్తంగా చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ మాట్లాడుతూ రాష్ట్రంలో నేటికీ అనేక మంది మత్స్యకార్మికులు వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెన్నమోని శంకర్, జిల్లాఉపాధ్యాక్షుడు కొండల్, నర్సింహ, రావనమోని రాజు, చింతకింది చక్రపాణి, జంగయ్య, కావలి రాములు, లక్ష్మయ్య, కర్నాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో డిజిటల్ విద్య అభినందనీయం

రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు

చంపాపేట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించడం అభినందనీయం అని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. చంపాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక స్కూల్‌లో మంగళవారం దాత అజితావెంకట్‌రాంరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ ప్రొజెక్టర్ రూంను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్‌పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. స్కూల్‌కు డిజిటల్ క్లాసుకు అనుబంధంగా ఐఎఫ్‌పీ ప్యానల్ మంజూరుకు కృషి చేయనున్నట్లు, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సహకారంతో అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. డిజిటల్ క్లాస్ రూం ఏర్పాటు చేసిన అజితావెంకట్‌రాంరెడ్డి దంపతులను డీఈవో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి, ఎంఈవో బాసునాయక్, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ ఎడ్మా మాధవరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గజ్జెల జనార్దన్‌రెడ్డి, జిల్లా శాఖ అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్‌రాంరెడ్డి, పురేందర్‌రెడ్డి, రజిత, అజిత, జ్యోతి, వినయ్‌కుమార్, కావ్య సుదేష్ణ పాల్గొన్నారు.



చంపాపేట ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ ప్రొజెక్టర్ రూంను ప్రారంభిస్తున్న డీఈవో సుశీందర్‌రావు

పార్కు స్థలాలను కబ్జా చేయలేదు

- మా వద్ద అన్ని పత్రాలు ఉన్నాయి
- ఇందులో మేయర్‌కు ప్రమేయం లేదు
- మా మీద అభాండాలు వేయొద్దు
- నాదర్‌గుల్ భూయజమానుల వెల్లడి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): 'పార్కు స్థలాలను కబ్జా చేయలేదు.. మా వద్ద అన్ని పత్రాలూ ఉన్నాయి. ఇందులో మేయర్‌కు ప్రమేయం లేదు' అని బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 31వ డివిజన్‌కు చెందిన భూయజమానులు బుక్క ప్రకాష్‌రెడ్డి, బుక్క ప్రదీప్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము అన్ని లింకు డాక్యుమెంట్ల ఆధారంగానే ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకుని, మునిసిపల్ నిబంధనల ప్రకారం టీఎస్‌బీపాస్‌లో ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకుని అనుమతి పొందామన్నారు. దాదాపు రూ.15కోట్ల విలువైన పార్కు స్థలాలను భూయజమానులు, కొందరు నేతలు కలిసి అన్యాక్రాంతం చేశారంటూ సోమవారం బీజేపీ నేత వెంకట్‌రెడ్డి చేసిన ఆరోపణలను వారు ఖండించారు. ఈ వ్యవహారంలో మేయర్‌కు ఎలాంటి సంబంధమూ లేదని వారు స్పష్టం చేశారు. మంగళవారం బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇక్కడి 743, 746 నుంచి 750 వరకు గల సర్వే నంబర్లలో గల దాదాపు 50 ఎకరాల వ్యవసాయ భూమిని తమ తాత బుక్క ఫకీర్‌రెడ్డి 1979లో మాధవరావు అనే బిల్డర్‌కు విక్రయించారని, ఆయన 1981లో లేఅవుట్ చేసి ప్లాట్లుగా విభజించాడని పేర్కొన్నారు. భూమి కొనుగోలు చేసిన మాధవరావు పూర్తి సొమ్ము చెల్లించలేక పోవడంతో, లేఅవుట్‌లో విక్రయించగా మిగిలిన 23 ప్లాట్లను(దాదాపు 3,000గజాలను) 2004లో తమ తండ్రి వెంకట్‌రెడ్డికి(ఫకీర్‌రెడ్డి కుమారుడు) రిజిస్ట్రేషన్ చేశాడని వారు పేర్కొన్నారు. తాము సదరు ప్లాట్లను 2012లో తమ పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇళ్ల నిర్మాణం కోసం టీఎస్‌బీపాస్‌లో దరఖాస్తు చేసుకున్నామని చెప్పారు. సదరు ప్లాట్లకు నిబంధనల ప్రకారం మొత్తం ఎల్ఆర్ఎస్ సొమ్ము సైతం చెల్లించామని తెలిపారు. ఆ తర్వాత వాటిలో నుంచి నాలుగు ప్లాట్లు విక్రయించి మిగతా ప్లాట్లను తమ భార్యల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించామని చెప్పారు. తాము ఎక్కడా కూడా పార్కు స్థలాలను కబ్జా చేయలేదని, తమకు న్యాయపరంగా సంక్రమించిన ఆస్తినే రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని వారు స్పష్టం చేశారు. రాజకీయంగా ఏమైనా ఉంటే నాయకులు తేల్చుకోవాలి గానీ తమ మీద అభాండాలు వేయొద్దని వారు సూచించారు.

బాలాపూర్ గణపయ్యకు ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి పూజలు

సరూర్‌నగర్: సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ లోని బాలాపూర్‌లో నిత్య పూజలందుకుంటున్న లంబోదరుడిని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి వినాయకుడి లడ్డూ ప్రసాదం అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.



బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

కొత్తపేట: మన్సూరాబాద్ పెద్దచెరువు కొలనులో వినాయకుల నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. మల్లికార్జుననగర్, సాయినాథ్‌కాలనీ, చంద్రపురి కాలనీ, హయత్‌నగర్ బొమ్మలగుడి ప్రాంతాల్లో గుంతలమయంగా మారిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండు చేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి కేవలం హైదరాబాద్, సికింద్రాబాదే కనిపిస్తున్నాయా, శివారు ప్రాంతాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నిమజ్జన ఏర్పాట్ల కోసం వెంటనే జోనల్ కమిషనర్లకు నిధులు విడుదల చేయాలని డిమాండు చేశారు.

- **హయత్‌నగర్:** హయత్‌నగర్ డివిజన్‌లోని బాతులచెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను మంగళవారం హయత్‌నగర్ సర్కిల్ డీసీ యాదయ్య, కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, ఎలక్ట్రిసిటీ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఈ దామోదర్, ఎలక్ట్రిసిటీ ఈఈ పున్నానాయక్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

'పెద్దఅంబర్‌పేట్'లో నాలుగు గ్రామాల విలీనం

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ విస్తరణలో భాగంగా ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న గ్రామాలను జీహెచ్ఎంసీలో విలీన ప్రక్రియ వేగవంతమైంది. శివారు గ్రామాలను ముందుగా సమీపంలోని మున్సిపాలిటీల్లో విలీనం చేసి ఆ తర్వాత జీహెచ్ఎంసీలో కలిపేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీకి ఆనుకుని ఉన్న తారామతిపేట, కుత్బుల్లాపూర్, గౌరెల్లి, బాచారం గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. నాలుగు గ్రామాల వీలిన ప్రక్రియను పర్యవేక్షించేందుకు పురపాలక శాఖ జేడీ శ్రీపాదరామేశ్వరావును ప్రత్యేక అధికారిగా నియమించింది. మంగళవారం ఆయన నాలుగు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పెద్దఅంబర్‌పేట్ కమిషనర్ రవీందర్‌రెడ్డితో కలిసి కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా విలీనం అనంతరం ఆయా గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. బుధవారం నుంచి నాలుగు గ్రామాల పాలన పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కార్యాలయం కేంద్రంగా కొనసాగనుంది.

టూరిజం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథిమ్)లో టూరిజం కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆమోదిత కళాశాలగా కొనసాగుతున్న నిథిమ్‌లో ఇంటర్ పాసైన విద్యార్థులు బీఎస్సీ, బీబీఏ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ అడ్మిషన్లకు, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు ఎంబీఏ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కంపెనీల్లో ఉద్యోగాలు పొందే అవకాశం లభిస్తుందన్నారు. అడ్మిషన్, ఇతర వివరాలకు సెల్: 9553700034, 9553700035 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

13 నుంచి వైర్‌మ్యాన్ సూపర్‌వైజర్ పరీక్ష రాసే అభ్యర్థులకు ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): వైర్‌మ్యాన్, సూపర్‌వైజరీ పరీక్ష రాసే ప్రైవేట్ సెక్టార్ ఎలక్ట్రీషియన్లకు ఈనెల 13వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యులు నేమాల బెనర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం వైర్‌మ్యాన్, సూపర్‌వైజరీ పరీక్షలను తెలంగాణలో స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తోందని, వీటిని రాస్తున్న అభ్యర్థులకు పదిహేను ఏళ్లుగా ఉచితశిక్షణ అందిస్తునట్లు తెలిపారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిభవన్‌లో ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. వివరాలకు 7989349899, 9848258202 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహిళలకు వ్యాసరచన పోటీలు

మదీన, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నైతిక విలువలు క్షీణిస్తున్నాయని జమాతె ఇస్లామీ హింద్ సంస్థ ఉమెన్స్ వింగ్ ప్రతినిధి డాక్టర్ అస్రా ముహ్సినా పేర్కొన్నారు. ఈ పరిస్థితిని రూపుమాపడానికి జమాతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో నైతిక విలువల ప్రచార ఉద్యమాన్ని చేపట్టిందని ఆమె తెలిపారు. నైతిక సమాజమే న్యాయమైన సమాజం'అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో నైతిక విలువలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో జరిగే ఈ పోటీల్లో 18 నుంచి 30 ఏళ్లలోపు విద్యార్థినులు, మహిళలు పాల్గొనవచ్చన్నారు. వ్యాసాలను ఈనెల 13 నుంచి 20వ తేదీలోగా పంపించాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినవారికి ప్రైజ్‌మనీ ఉంటుందన్నారు. వివరాలకు 95154 78080 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

నేడు జూపార్కులో అటవీ అమరుల సంస్మరణ దినం

మదీన, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ జూపార్కులో ఈనెల 11న అటవీ అమరులల సంస్మరణ దినాన్ని నిర్వహించనున్నారు. అటవీ సంపదను కాపాడడానికి విధినిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన అటవీ అధికారులు, ఉద్యోగుల స్మారకార్థం అమరుల దినాన్ని నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజమండ్రి వాస్తవ్యుడు, కర్నాటక కేడర్ ఐఎఫ్ఎస్ అధికారి పి.శ్రీనివాస్ 1991లో గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో హత్యకు గురయ్యారు. ఆయన స్మారకార్థం ప్రతి సంవత్సరం అటవీ శాఖ అమరవీరుల దినాన్ని నిర్వహిస్తున్నారు.

లైసెన్స్ లేని పదిహేను ఆటోలు సీజ్

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): లైసెన్సులు లేకుండా ప్యాసింజర్‌ను తీసుకెళ్తున్న 15 ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మైలార్‌దేవుపల్లి, దర్గానగర్ ప్రాంతాలలో పోలీసులు వాహన తనిఖీలను మంగళవారం నిర్వహించారు. చాలామంది లైసెన్స్ లేకుండా ఆటోలు నడుపుతున్నట్టు గుర్తించి, వారికి లెర్నింగ్ లైసెన్స్ ఇప్పించారు. ఈ తనిఖీలలో ఎస్ఐ రాజేందర్, ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు చిరంజీవి, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై కారు ఢీకొని ఔట్‌సోర్సింగ్ కార్మికురాలు మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్‌పై కారుఢీకొని ఔట్‌సోర్సింగ్ కార్మికురాలు మృతి చెందింది. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఇబ్రహీంపట్నానికి చెందిన బసవపురం లలిత(45) ఓఆర్ఆర్‌పై ఔట్‌సోర్సింగ్ కార్మికురాలిగా పనిచేస్తోంది. మంగళవారం మధ్యాహ్నం ఆమె తారామతిపేట ఎగ్జిట్ సమీపంలో ఓఆర్ఆర్‌పై డీవైడర్ వద్ద పని చేస్తోంది. అదే సమయంలో ఘట్‌కేసర్‌నుంచి పెద్దఅంబర్‌పేట్ వైపునకు వస్తున్న ఓక్స్‌వ్యాగనర్ కారు ఆమెను బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలకు గురైన ఆమెను అంబులెన్స్‌లో పీర్జాదీగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆమె సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటన జరిగిన అనంతరం కారును అక్కడే వదిలేసి డ్రైవర్ పారిపోయినట్లు పోలీసులు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్లు జైలు, జరిమానా

హయత్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి 5 సంవత్సరాల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని ఎల్బీనగర్‌లోని ఫాస్ట్ ట్రాక్‌కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి తీర్పిచ్చారు. హయత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇల్లా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలానికి చెందిన విక్రమ్ 2018లో హయత్‌నగర్ ప్రాంతంలో ఓ బాలికను ప్రేమపేరుతో దగ్గరై అపహరించి మభ్యపెట్టి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసులో నిజానిజాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి పోక్సో చట్టం ప్రకారం 5 సంవత్సరాల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చారు.